క్లుప్తంగా

వేం నరేందర్‌రెడ్డికి ఘన సన్మానం



నెల్లికుదురు: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి నెల్లికుదురు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ నుంచి మహబూబాబాద్ పార్లమెంట్ పర్యటనలో భాగంగా బుధవారం నెల్లికుదురు మండల కేంద్రానికి చేరుకున్న నరేందర్‌రెడ్డికి స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో నాయకులు ఎద్దళ్ల యాదవరెడ్డి, ప్రభాకర్ గౌడ్, అశోక్ గౌడ్, రాష్ట్ర, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోర్నకల్: 11కేవీ విద్యుత్ లైన్లలో మరమ్మతు పనుల కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 11 కేవీ తహసీల్దార్ బంజర, చిలుకోడు లైన్లలో మరమ్మతులతో తహసీల్‌దారు బంజర, అమ్మపాలెం, సీతారాంపురం, బూరుగుపాడు, దుబ్బతండా, కన్నెగుండ్ల గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కిరణ్ తెలిపారు.

మజ్జిగ పంపిణీ చేసిన ముస్లిం



మహబూబాబాద్ రూరల్: శ్రీరామ నవమి సందర్భంగా న్యూరాజు రేడియో హౌజ్ యజమాని ఫిరోజ్, మైనారిటీల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం భక్తులకు చల్లని మజ్జిగ, నీరు పంపిణీ చేశారు.

మహాఅన్నదానం



మరిపెడ రూరల్: మండలంలోని ఉల్లెపల్లి గ్రామం రామాలయంలో సీతారాములోరి కల్యాణానికి హాజరైన మహబూబాబాద్‌కు చెందిన దాత, ప్రముఖ వ్యాపారవేత్త తవిసి వీరభద్రం, సుజాత దంపతులు, మాజీ సర్పంచ్ చిర్రబోయిన ప్రభాకర్, సునీత దంపతులు కల్యాణ తంతును బుధవారం జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

108 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూసెంటర్: 108 వాహనాల్లో పని చేసే సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వాహన సిబ్బంది యూనియన్ జిల్లా అధ్యక్షుడు జక్కుల వీరన్న కోరారు. ఈమేరకు ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయన కోరారు.

రెండు లారీలు ఢీ.. తప్పిన ప్రమాదం

దంతాలపల్లి: మండలకేంద్రంలో రెండు లారీలు ఢీకొన్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి సిమెంట్ లోడుతో వరంగల్ వైపు వెళ్తున్న లారీ మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామం చేరుకుంది. లారీ వెనుక టైర్లో గాలి లేకపోవడంతో డ్రైవర్ లారీని రోడ్డు పక్కన నిలిపాడు. అదే రూట్‌లో వస్తున్న మరో లారీ వెనుక నుంచి ఆగి ఉన్న లారీని ఢీకొట్టి రోడ్డుకు అడ్డంగా తిరిగింది. దీంతో వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై కరుణాకర్ కానిస్టేబుల్ గణేష్‌ను పంపించి జేసీబీ సహాయంతో లారీలను తొలిగించి ట్రాఫిక్ క్లియర్ చేయించాడు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఘన నివాళి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త రామసహాయం రంగారెడ్డి గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, వరంగల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు సిరిసిల్ల రాజయ్య బుధవారం తానంచర్లకు హాజరై రంగారెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి ఘననివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రామసహాయం సత్యనారాయణరెడ్డి, అనంత్‌రెడ్డి, కోట వెంకట్‌రెడ్డి, అజిత్‌కుమార్, తదితరులు ఉన్నారు.

సీతారాముల కల్యాణం

మహబూబాబాద్ రూరల్: శనిగపురం గ్రామంలో కల్యాణ వేడుకలు



గూడూరు: సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు



తొర్రూరు: దుబ్బతండాలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దంపతులు





కేసముద్రం: కాట్రపల్లి శివాలయంలో ..

శ్రీరామనవమి పురస్కరించుకొని బుధవారం సీతారాముల కల్యాణ వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. కల్యాణతంతును సంప్రదాయ పద్ధతిలో జరిపించారు. రెండు గంటలపాటు పూజారులు వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ వేడుకలు నిర్వహించారు. వేలసంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి కల్యాణ సమయంలో తాళిబొట్టు చూపుతుండగా తన్మయంతో చేతులెత్తి భగవంతుడిని వేడుకున్నారు. జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం చేశారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: ముడుపుగల్ గ్రామంలో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు



నెల్లికుదురు: శ్రీరామగిరి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు దంపతులు



మహబూబాబాద్ అర్బన్: ముత్యాలగూడెంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు



మరిపెడ రూరల్: ఎడ్జెర్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో తాళిబొట్టు చూపుతున్న అర్చకులు



తొర్రూరు రూరల్: గుర్తూరులో సీతారాముల విగ్రహాలను ఊరేగింపు చేస్తున్న భక్తులు



గంగారం: కోమట్లగూడెం కల్యాణంలో పాల్గొన్న భక్తులు



గార్ల: వర్తకసంఘం భవనంలో..



కొత్తగూడ: నీలంపల్లిలో..



కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెంలో..



కురవి: రామాలయం వద్ద..



దోర్నకల్: ఉయ్యాలవాడలో..



పెద్దవంగర: ఉప్పరగూడెం రామాలయంలో..



మరిపెడ: కల్యాణ వేడుకలకు హాజరైన భక్తులు



నర్సింహులపేట: తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు



దంతాలపల్లి: దాట్ల గ్రామంలో..



బయ్యారంలో..

గిరిజనులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో గిరిజన సామాజికవర్గ ప్రజాప్రతినిధులకు మంత్రి మండలిలో చోటు కల్పించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ అన్నారు. మానుకోటకు వచ్చిన ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయక్ మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని, రిజర్వేషన్ పెంపు, జీపీలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించి అభివృద్ధి కోసం బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సీఎం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారన్నారు. కార్యక్రమంలో సంఘం , భూక్య బాలాజీనాయక్, పదో వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీనునాయక్, భూక్య సంతోష్‌నాయక్, రవీందర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చికిత్స పొందుతున్న మహిళ మృతి

దంతాలపల్లి: మండల కేంద్రంలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గున్నెపల్లి గ్రామానికి చెందిన బండారి భూలక్ష్మి(60) మంగళవారం ఉపాధి హామీ పనికి వెళ్తున్న క్రమంలో గ్రామానికి చెందిన రాగి సుధాకర్ బైక్‌తో వెనక నుంచి ఢీకొట్టాడు. వెంటనే భూలక్ష్మి రోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో తొర్రూరులోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలు కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపాడు. భూలక్ష్మి మృతితో ఆమె భావ మనవడి పెళ్లి ఆగిపోయింది.

'ఉపాధి'లో కనీస సౌకర్యాలు కరువు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- నీడ పరదాలు, మెడికల్ కిట్ల పంపిణీ లేదు
- ఇబ్బంది పడుతున్న కూలీలు

గార్ల: ఉపాధి పనుల ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో మండలంలో ఉపాధి పనులకు కూలీలు ఆసక్తి కనబర్చడం లేదు. పని ప్రదేశాల్లో నీడ పరదాలు కల్పించకపోవడంతో కూలీలు ఎండబారిన పడి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. దీనికి తోడు పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు సైతం అందుబాటులో ఉంచకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు రోజుకు రూ.300 వేతనం చెల్లించాలని ప్రభుత్వం చెబుతుండగా కేవలం రూ.188 మాత్రమే వస్తుంది. కూలీలకు వేతనాలు వారానికి ఒకసారి చెల్లించాల్సి ఉండగా నెలకు ఒకసారి కూలీల అకౌంట్ల ద్వారా చెల్లిస్తున్నారు. మండలంలో 12,000 జాబ్‌కార్డులు ఉండగా, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో కేవలం 2500 మంది మాత్రమే కూలీలు పనులకు వస్తున్నారు. మండలంలో 44 హ్యాబిటేషన్లకు గాను 36 హ్యాబిటేషన్లలో మాత్రమే పనులు నిర్వహిస్తున్నారు. కూలీలకు తాగునీటి సౌకర్యం గ్రామ పంచాయతీ సిబ్బంది అన్ని పని ప్రదేశాల్లో సక్రమంగా అందించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కూలీలకు రోజుకు వేతనం రూ.300 చెల్లించి, పని ప్రదేశాల్లో నీడ పరదాలు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయంపై ఏపీఓ సజన్ స్వరూప్‌ను సాక్షి వివరణ కోరగా ఈ ఏడాది ప్రభుత్వం నుంచి నీడ పరదాలు, మెడికల్ కిట్లు ఇంత వరకు రాలేదన్నారు. ఎండ తీవ్రతకు తక్కువ సంఖ్యలో కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారని తెలిపారు.

బెరైటీస్ అక్రమ రవాణా.. నలుగురిపై కేసు నమోదు

గార్ల: అక్రమంగా బెరైటీస్ ఖనిజాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తూ పోలీసులకు పట్టుబడిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ బుధవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి.. మండలంలోని సేరిపురం పంచాయతీలోని బెరైటీస్ గుట్టల ప్రాంతంలో గల విలువైన బెరైటీస్ ఖనిజాన్ని మైనింగ్ అక్రమార్కులు అక్రమంగా ట్రాక్టర్లలో లోడ్ చేస్తుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు ఖమ్మంకు చెందిన ఒరుసు సిద్ధు, ఆలకుంట్ల రామకృష్ణ, దనుగుల కృష్ణ, మరిపెడకు చెందిన బానోత్ అనిల్‌లను పట్టుకొని ఖనిజాన్ని లోడ్ చేస్తున్న 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. దాడుల్లో ఏఎస్సై రవీందర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



రమేష్ (ఫైల్)

దంతాలపల్లి: మండల కేంద్రంలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తూర్పుతండా గ్రామపంచాయతీకి చెందిన మలోత్ రమేష్(30) తన పొలంలో హార్వెస్టర్‌తో వరిని కోయిస్తున్నాడు. విద్యుత్ స్తంభం నుంచి బావి వరకు మోటార్‌కు గుంజలు పాతి సర్వీస్ వైరు లాగాడు. హార్వెస్టర్‌కు వైరు తాకుతుందని వైరును చేతితో తప్పించబోయాడు. దీంతో ఫెయిల్ అయి ఉన్న విద్యుత్ వైర్‌కు రమేష్ చేతి తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య చిన్ని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపాడు.

బడుగు, బలహీనవర్గాల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న మురళీకృష్ణ

మరిపెడ: బడుగు, బలహీన వర్గాల పరిరక్షణే ధ్యేయంగా ప్రజల పక్షాన పోరాడుతామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమక్రసీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మేకల మురళీకృష్ణ అన్నారు. మరిపెడలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మోదీ పదేళ్ల పాలనలో హిందుత్వ పాసిస్టు శక్తులు, దళితులపైన దాడులు పెరిగాయన్నారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్రంలో గత పాలకులు తెలంగాణ ప్రజలను ఆర్థికంగా వెనక్కునెట్టి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారన్నారు. ప్రాజెక్టులు రిడిజైనింగ్ పేరుతో రూ. లక్షల కోట్లకు అవినీతిని పాలడ్డారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హలావత్ వెంకన్న, జడ సత్యనారాయణ, ఉడుగుల లింగయ్య, సామ పాపయ్య, చిర్ర యాకయ్య, భిక్షం, కమలాకర్, రవిందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం



మరిపెడ రూరల్: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై

మరిపెడ రూరల్: వేసవిలో ఎండ వేడిమిని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలు, ప్రయాణికుల దప్పిక తీర్చడం అభినందనీయమని మరిపెడ అదనపు ఎస్సై సంతోష్ అన్నారు. మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలోని ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఎస్సై యూత్ సభ్యులతో కలిసి ప్రారంభించారు.
డోర్నకల్: మండలంలోని గొల్లచర్లస్టేజితోపాటు గ్రామంలో బుధవారం చలివేంద్రాలను ప్రారంభించారు. గొల్లచర్లకు చెందిన కల్లెపు సత్యవతి జ్ఞాపకార్థం ఆమె భర్త రిటైర్డ్ ఉపాధ్యాయుడు నారాయణ, కుమారుడు బీఆర్ఎస్ మండల నాయకులు కల్లెపు సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు ప్రాంతాల్లో చలివేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, మాజీ సర్పంచులు చేరెడ్డి సమ్మిరెడ్డి, గంధసిరి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల బహూకరణ



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లిలో శ్రీసీతారాముల కల్యాణం అర్చకులు తాటిపాముల దుర్గాప్రసాద్, శ్రీనివాసచార్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణానికి పంచలోహ విగ్రహాలను నామిరెడ్డి సీతారాంరెడ్డి, హమేంద్రాదేవి దంపతులు బహూకరించారు. కల్యాణ దంపతులుగా వెంకన్న సంతోష, రమేష్ జ్యోతి కూర్చున్నారు. కార్యక్రమంలో కల్యాణోత్సవ కమిటీ సభ్యులు దీకొండ రమణ, సింగంశెట్టి బాబురావు, గుంటి చలమయ్య, కొమ్ము కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతివనంలో చెట్లు నరికిన గుర్తు తెలియని వ్యక్తులు



కొత్తగూడ: మండలంలోని వేలుబెల్లి మెగా పల్లెప్రకృతి వనంలోని చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రెండేళ్ల క్రితం అయిదు ఎకరాల్లో మెగా పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. ఏపుగా ఎదిగాయి. రెండు రోజుల క్రితం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లు నరికేశారు. సుమారు 15వేల చెట్లు నరికినట్లు అధికారులు గుర్తించారు. కాగా పల్లె ప్రకృతి వనం భూమిని ఆక్రమించుకునేందుకే చెట్లు నరికి ఉంటారని గ్రామంలో చర్చ జరుగుతోంది. ఘటనపై కొత్తగూడ పోలీస్ స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేశారు.